# హరివంశము

(39-వ పేజీ తరువాయి)

అంధకారము ఖండింపబడుటలేదు. చంద్రుడు ఉదయిస్తే మనస్సు చల్లబడుతుందట! మరి తనకు ఆ చల్లదనమేమియు కన్పించుటలేదు. "ఓయి! ఓషధులకు రాజా! నాయీ భీతికి ఔషధంలేదా"" అని కంసుడు మనస్సులో అనుకున్నంతలో, ఆ చంద్రుడు తన్ను చూచి వికటమైన హాసం చేసినట్లు, యమునమీదుగా ఒకఘూకం మొరస్తూ పోయింది. ఒక తీతువ అరుస్తూ ఎగిరిదిం. ఎవరో తన్ను పిలిచి "కంస! ఆ తీతువవు నీవు" అన్నట్లు అనిపించింది.

ఆ చంద్రుణ్ణి చూడగా కంసునకు కోపము వచ్చినది. ఆ వెన్నలను చూడగా కంసునకు వెక్కసం అయిపోయినది. ఆ చంద్రుడు తనకు సరిగా కన్పించుటలేదు. అజ్ఞానికి ఆత్మద్రవ్యం ద్వైతమై భాసించినట్లు, ఆ చంద్రుడు కంసునకు రెండై కన్పించినాడు. అతని మనస్సు అనాహ్లాదియై గుడుసుళ్లు తిరిగింది. ఆ మసక వెన్నెలలో యమున తన జీవితమును అంటవచ్చిన కాలసర్పాన్ని పోలి కన్పించింది. కాళీయ సర్పదమనుని శరీరాన్ని పోలి, కీర్తినిపోలి, అతనికి స్పష్టము కాక, అస్పష్టముకాక, ఇతమిత్థమని నిర్ణయించరానిదై, మనస్సులో భయాన్ని, బుద్ధిలో ఆలస్యాన్ని, అంతఃకరణలో మాంద్యాన్ని సృష్టించింది.

కంసుడు తిరిగి తనమందిరాలను చేరుకున్నాడు. రాత్రి చాలా ప్రొద్దుపోయింది. మందిరంలో అంతా నిద్రిస్తూవుంటారు. తనకు నిద్ర రావడములేదు. అట్లా హంసతూలికా తల్పంమీద నడుమువాలిస్తే, నిద్ర ఏమన్నా వస్తుందేమో ననుకున్నాడు కంసుడు. తాను మందిరములనూ దరియుసరికి దాసదాసీజనాలంతా ఆదమరచి నిద్రపోతున్నారు. ఆ సుఖం తనకు లేదే అని కంసుడు మనస్సులో పరిదేవనం చేశాడు. శయనమందిరంలో మణిదీపం మందంగా ప్రకాశిస్తున్నది. కంసుడు తల్పాన్ని అధిరోహించి, శయనించి, కన్నుమూసినాడు. మనస్సును చిక్కబట్టి నిద్రపో ప్రయత్నించినాడు. ఎప్పుడు నిద్రపట్టినదో అతనికి తెలియలేదు. అతనికి మెలకువరాగా తెలిసినది ఇది. ఆ నిద్రలో తనకు కొన్ని కలలువచ్చినవి. అవిభయంకరముగావున్నవి. ఒక కలలో తాను గరళమును తినినాడు. మరి ఒక కలలో ప్రేతాన్ని పరిరంభణంలో పట్టినాడు. మరి ఒక కలలో తాను దిగంబరుడై, ఖరారూఢుడై తిరిగినాడు. విషభక్షణంచేసినాడు. జపాకుసుమ మాలియై ఊరేగినాడు. ఇన్ని కలలు రాగా తనకు మెలకువరాలేదు. ఆ కలలు మనస్సునకు సుఖాన్ని ఇచ్చాయా? కంసునకు అర్థము కాలేదు. అతనికి అర్థమైనట్లు కన్పించిన కల ఇది. అతనిలోని భయమును మరి యింతగా రగుల్కొల్పిన కల ఇది. తాను నిద్రపోతున్నాడు. ఆ నిద్రలో తనకు ఒక కలవచ్చింది. ఒక స్త్రీ. నల్లనిది. ఎఱ్ఱని కోక కట్టుకున్నది. తల విరబోసుకున్నది. చేతిలో ఖడ్గాన్ని ధరించినది. ఆమె వెంట ఆమెను పోలిన స్త్రీలే, ఇంకా ఎంతమందియో వున్నారు. అందులో ఒక్కర్తుక, దిగంబరి, తన్ను, నిద్రనుండి లేపినది. తాను లేచినాడు. ఆ దిగంబరి నవ్వుతూ, తన్ను కౌగలించుకోవచ్చినది. తనకు భయము వేసినది. దానిని తాను మందలించబోయినాడు. నోట మాటరాలేదు. ఆ దిగంబరి నవ్వినది. అట్టహాసముగా నవ్వినది. ఆ నవ్వు నవ్వుగాలేదు. కత్తులుచిమ్ముతున్నట్లు వున్నది. ఆ స్త్రీ అన్నది. "కంస! నేను నీకు రుచించడము లేదా?" తాను అనుకున్నాడు. ఈ స్త్రీ రుచించడము ఏమిటి? ఇంకా చాల మంది స్త్రీలు వున్నారు. వారు గూడ తనకు రుచించునట్లు లేరు. ఈ స్త్రీ లేమి? ఈ రుచులేమి? అనుకున్నంతలో రక్తాంబరధారిణి, ఖడ్గహస్త, కాలవర్ణ మందహాసంచేసింది. "కంస! నన్ను ఎరుగుదువా" అన్నది. "నీవు ఎవ్వరవు?" అన్నాడు తాను. "నేనా! నేనా! కంస! నీకు మృత్యువును" అన్నది ఆమె. అని మహాహాసం చేసింది. ఆ మహాహాసం వినగా కంసునకు భయమైనది. భయములో మెలకువ వచ్చినది. గుండె ఇంకా కొట్టుకుంటున్నది. శరీరము స్వేదజలస్విన్నమైవుంది. కంసుడు తాను ఏమైపోతున్నానా! అనుకున్నాడు. బిగ్గరగా "తల్లీ! తల్లీ! నేను ఏమైపోతున్నాను" అని ఆక్రోశించినాడు. ★

---

కంలో కొందరిపట్ల మాత్రమే సార్థకమౌతుంది. పంతులుగారలాంటివారు తప్పడు అంచనా వేసుకుని తనదగ్గరికి వచ్చిన ఆ యువకుణ్ణి ఆయన చురచుర చూచారు. ఆ మట్టి ముద్దలో ఈ తేజాన్ని రగుల్కొలిపారు. మనిషిగా పుట్టినవాడివి మనిషిగానే బ్రతకమని బుద్ధి చెప్పారు.

ఉద్యోగానికి సిఫార్సు చేస్తూ ఆయన తన స్నేహితుడికి వ్రాసియిచ్చిన చీటితో, చేతిఖర్చులకోసం యిచ్చిన డబ్బుతో మాఅమ్మా, నాన్నా దూరప్రాంతాలకు వెళ్లి పెళ్లి చేసుకున్నారు. ఆ పెళ్లి జరిగిన మూడుమాసాలకు నేను పుట్టాను.

పంతులుగారిని గాకుండా మానాన్నగారు మరొకరిని ఆశ్రయించినట్టయితే ఒకటి రెండు జీవితాలు సర్వనాశనానికి గురై వుండేవి. ఆయన యింకా కళ్ళు తెరవని పసినిసుగును కాపాడారు. దుర్గతికిలోను కావలసిన ఒక అబల జీవితంలో వసంతాలు వెలయించారు. సంజవేళల్లో నట్టింటదీపం వెలిగించినప్పుడల్లా మా అమ్మ ఆయన్ను తలచుకునేది. పంతులుగారి పేరు పార్థసారథిగారు. ఆయన పట్లగల

# ప్రాణదాత

(31-వ పేజీ తరువాయి)

భక్తిభావంతో మా అమ్మ నాకా పేరు పెట్టుకుంది..."

చేత గొడుగుతో, పొడుకాటి కోటుతో, తెల్ల టీతలపాగాతో, చిరునవ్వులు మెరుగులు దిద్దుతున్న నెరసిన మీసాలతో నీరజ మనోనేత్రాలకు తాతయ్య ఆకృతి ప్రత్యక్షమైంది.

"ఇప్పుడు మీరు నన్నిలా రెండోసారి రక్షించారు..."

నీరజ అడ్డు తగిలింది. "ఇందులో నా గొప్పేమీ లేదు. నేను డాక్టర్ని. మీరు పేషంటుగా నా దగ్గరికొచ్చారు. మీ జబ్బును నేను నయంచేయగలిగాను. అది నా వృత్తిధర్మం..."

కుర్చీలోనుంచి లేచి నీరజ మెల్లగా బయటకు వెళ్ళిపోయింది.

* * *

వారం రోజుల తర్వాత ఓ ఉదయం అయిదుగంటలకే నిద్రలేచి డాబా పైన పచార్లుచేసి క్రిందికిదిగివచ్చాడు సారథి. నీరజ గదిలో కూర్చుని పత్రిక చదువుకుంటోంది.

సారథి కనిపించగానే పరామర్శించింది నీరజ. "అప్పుడే ప్రాతఃకాల విహారాలు ప్రారంభించారన్నమాట!"

గదిలో ప్రవేశించి కుర్చీలో కూర్చుంటూ "ఈ మొదటి తరగతి రాజకీయ ఖైదీకి ఆ మాత్రం స్వేచ్ఛ వుందనే నేను భావిస్తున్నాను" అన్నాడు సారథి.

"అమ్మో, మీరు చమత్కారంగా గూడా మాట్లాడగలరే! నేనింకా ఏమిటో అనుకున్నాను..."

నీరజ మళ్ళీ పత్రికా పఠనంలో లీనమైంది.

ఏదో మాట్లాడ దలచుకున్నట్టుగా సారథి గొంతు సవరించుకున్నాడు. కాసేపు నేలవైపు చూచాడు. మళ్ళీ తలపైకెత్తాడు...

"ఏమిటో చెప్పదలచుకున్నారల్లేవుంది..." నీరజే ప్రసంగానికి దారితీసింది.

"ఏమీ లేదు. మీరు చేసిన మేలుకు ఎలా

